జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 28-10-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 495 పేజీలు: 4 వెల : రూ.7

# అడుగుకో.. బెల్ట్!







* ప్రభుత్వ పెద్దల ఆధీనంలో నడుస్తున్న మద్యం షాపుల నుంచే తరలింపు
* శ్రీకాకుళం, పలాస, తదితర ప్రాంతాల్లో వైన్ షాపుల పక్కనే బెల్ట్‌లు
* అసలు జిల్లాలో బెల్ట్ షాపులే లేవంటున్న ఎక్సైజ్ అధికారులు
* మామూళ్ల మత్తులో కళ్లకు గంతలు కట్టుకున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు
* ఫిర్యాదు చేసినా దాడులు చేయని వైనం
* అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
* అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమని చెబుతున్న కొందరు పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 27 (వార్త):** జిల్లాలో ఎక్సైజ్, పోలీస్ శాఖ కళ్లకు గంతలు కట్టుకుంది. ఊరూరా, వీధివీధినా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కనిపిస్తున్నా.. అబ్బే.. బెల్ట్ షాపులా.. అసలే లేనే లేవు అంటూ బుకాయిస్తోంది. ప్రభుత్వ పెద్దల మద్యం అక్రమ వ్యాపారానికి వంత పాడుతూ వారి దోపిడీని కప్పిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతోంది. ఎక్సైజ్ శాఖ తీరు చూస్తుంటే పచ్చ కామెర్లు సోకిన వారికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందన్న చందంగా తయారైంది. నిబంధనలకు విరుద్ధంగా రహదారి పక్కనే వైన్‌షాప్ సమీపంలో బెల్ట్ దందా నడుస్తున్నా అధికారులకు మాత్రం కనబడదు. జిల్లాలో మంచినీళ్లకైనా కొదవుంటుందేమో గాని మద్యం మాత్రం ఎక్కడంటే అక్కడ దొరుకుతుంది. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయానికి సమీపంలో ఓ బెల్ట్‌షాపు ఉంది. ట్రాఫిక్ పోలీసులు అక్కడక్కడే బందోబస్తు చేస్తుంటారు. వారికి మాత్రం ఈ బెల్ట్‌షాపు కనబడదు. నగరంలోని మద్యం షాపులకు ఆనుకునే బెల్టుషాపులు ఉన్నా ఎక్సైజ్ శాఖకు కనబడదు. పలాస కాశీబుగ్గ పట్టణంలో మెయిన్‌రోడ్డులోనే బెల్ట్‌షాపులు జోరుగా ఉన్నా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోరు. ప్రభుత్వ పెద్దల ఆధీనంలో ఉన్న మద్యం షాపుల నుంచే ఈ బెల్ట్ షాపులకు మద్యం నిత్యం సరఫరా అవుతోంది. మరో విషయమేమిటంటే వీరే ఆ షాపులకు వాహనాల ద్వారా మద్యం రవాణా చేస్తున్నారు. ఇవన్నీ ఎక్సైజ్, పోలీసు అధికారులకు కనిపించడం లేదు. పలాస కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌కు ప్రతినెలా ఒక్కో మద్యం షాపు నుంచి పదివేలు చొప్పున మామూళ్లు వెళుతున్నాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపులు లేకుంటే మద్యం షాపులు నడపలేమని నిర్వాహకులే చెబుతుండడం చూస్తుంటే బెల్ట్ షాపుల్లో ఏ మేరకు విక్రయాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే కొత్తరోడ్డు సమీపంలోని ఓ గెడ్డకు ఆనుకుని ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద అనుమతి లేకుండా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకుని మద్యం లూజు విక్రయాలు జరుగుతున్నాయి. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసే జరుగుతోంది. తమకు అధికార పార్టీ నేతల అంగ, అర్ధబలముందని ఎవరేం చేయలేరన్న ధీమాతో నిర్వాహకులు ఉన్నారు. ఇటీవల జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సిహెచ్ తిరుపతి నాయుడు మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని బెల్ట్‌షాపులను మూసివేశామని, ఎక్కడ కూడా ఈ షాపులే లేవని చెబుతుండడం గమనార్హం.




## పేకాటరాయుళ్ల అరెస్టు

**వజ్రపుకొత్తూరు, అక్టోబరు 27 (వార్త):** ధర్మపురం సమీపంలో తోటలో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్న ముగ్గురిని వజ్రపుకొత్తూరు పోలీసులు అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు, సెల్‌ఫోన్లు, రూ.1020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. జీడి తోటల్లో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేశామని హెచ్‌సీ పేర్కొన్నారు.

## కార్తీక శోభ



**జలుమూరు, అక్టోబరు 27(వార్త):** కార్తీక మొదటి సోమవారం సందర్భంగా జిల్లాలోని శివాల యాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయంలో, శ్రీముఖలింగంలోని మధుకేశవ ఆలయం, రావివలసలోని ఎండల మల్లికార్జున స్వామి, తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శ్రీముఖలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి స్పెషల్ దర్శనం, ప్రసాదాల విక్రయాలు, హుండీ ద్వారా మొత్తం రూ. 1,41,358/- ఆదాయం లభించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

# దొంగల ముఠా అరెస్టు

* 186 గ్రాముల బంగారం, 263 గ్రాముల వెండి నగలు, ఆభరణాలు స్వాధీనం
* నిందితులంతా పాత నేరస్థులే
* వివరాలు వెల్లడించిన ఏఎస్పీ శ్రీనివాసరావు

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు27 (వార్త):** శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రాత్రిపూట చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ పి.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నందగిరిపేట గ్రామంలో రెండు, రాగోలు గ్రామంలో ఒకటి, గార పోలీస్ స్టేషన్ పరిధిలోని కె.మత్స్యలేశం గ్రామంలో మూడు దొంగతనం కేసులు నమోదయ్యాయన్నారు. నిందితులు రాత్రిపూట ఇంటి తలుపులకు వేసిన తాళాలను పగలగొట్టి, ఇంటిలోని బంగారం, వెండి ఆభరణాలు, నగదును దొంగిలిస్తారని చెప్పారు. కాకినాడకు చెందిన రేకడి వెంకటేశ్వర్లు, ధర్మాది ప్రసాద్, మాడెం మోహన్‌కుమార్‌లను అరెస్టు చేశామన్నారు. వీరిపై పలు కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. ఈనెల 26న మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీకాకుళం జాతీయ రహదారిలోని తండేవలస గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో ఓ ఇంటి వద్ద వీరిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 186 గ్రాముల బంగారు, 263 గ్రామల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కేసులను అత్యంత చాకచక్యంగా ఛేదించి, నిందితులను అదుపులోకి తీసుకొని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సి.హెచ్.వివేకానంద, సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.పైడపు నాయుడు, శ్రీకాకుళం రూరల్ ఎస్సై కె.రాము, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



## ఆంగ్లం అతిథి అధ్యాపకుడి పోస్టునకు దరఖాస్తుల ఆహ్వానం



**మందస, అక్టోబరు 27(వార్త):** మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్లం అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తుల కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.తేజేశ్వరరావు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. ఒక సెట్ నకలు పత్రాలు, ఫొటోలతో సహా బయోడేటాను నేరుగా ఈనెల 29న సాయంత్రం 5 గంటలలోపు ప్రభుత్వ జూనియర్ కళాశాల, మందసలో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇంటర్వ్యూ ఈ 31న ఉదయం 11గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల(బాలురు), శ్రీకాకుళం కార్యాలయంలో ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని, విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## కార్గో ఎయిర్‌పోర్ట్ భూసర్వే..అధికారులతో రైతుల వాగ్వాదం



**మందస, అక్టోబరు 27(వార్త):** ఉద్దానంలో మళ్ళీ కార్గో ఎయిర్ పోర్ట్ భూసర్వే కలకలం మొదలయ్యింది. కొద్ది రోజుల పాటు ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో భూసర్వే పేరిట అధికారులు రావడంతో రైతులు ఒక్కటయ్యారు. అధికారులతో వాగ్యుద్ధానికి దిగారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీలో గల బిడిమి రెవిన్యూ గ్రామంలో తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ తో పాటు, మండల సర్వేయర్, వి.ఆర్.ఓ ఆధ్వర్యంలో భూములు సర్వే చేయడానికి వస్తున్నారన్న విషయం తెలుసుకొని బాధిత రైతులు మూకుమ్మడిగా తహసీల్దార్ తో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ గత 11నెలలుగా శాంతియుతంగా ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు నేరుగా కలిసి మా బాధితులకు సంబంధించిన ఒక్క సెంటు భూమి కూడా కార్గో ఎయిర్ పోర్టుకి ఇచ్చే పరిస్థితి లేదని చెప్తున్నప్పటికీ, మళ్ళీ భూములను కొలతలు వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. మా ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధపడతాం.. కానీ మా జీవనాధారమైన భూమి ఒక్క అంగుళం కూడా ఇవ్వమన్నారు. ఇదే విషయాన్ని మరోసారి ప్రభుత్వంకి తెలియజేయాలని కోరారు. మొన్నటి వరకు మాలో కొందరు భూములు ఇస్తామని చెప్పినవారు కూడా ఈరోజు వాళ్ళు మాతో కలిసి పోరాటం చేస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు పునఃపరిశీలించాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఒక వైపు మొంథా తుఫాను అని హెచ్చరికలు జారీ చేసి ఈ నెల 27, 28, 29 తేదీల వరకు మత్స్యకారులు వేటకి వెళ్ళొద్దని చెప్తూ, పాడి పరిశ్రమ రైతులు తోటల్లో తిరగరాదని అదేశాలు జారీ చేయగా, మరోవైపు ఇంత పెద్ద మొంథా తుఫాన్ సమయంలో కూడా భూ సర్వేలు పేరిట అధికారులని పంపించి కొలతలు వెయ్యడమనేది చాలా ఆవేదనకి గురి చేస్తోందన్నారు. ఇక్కడ విషయాలను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ రైతులకు చెప్పారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, నల్ల పరుశురాం, చిత్త కుర్మారావు, జుత్తు గున్నయ్య, పుక్కల్ల నారాయణ, దున్న సురేష్, గుంటు లోకనాధం పాల్గొన్నారు.

## తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**మందస, అక్టోబరు 27(వార్త):** మందస మండలంలోని తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ కోరారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతంలోని సముద్ర తీర ప్రాంతాల్లో శ్రీకాంత్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో ఆయన మాట్లాడుతూ మొంథా తుపాను దృష్ట్యా తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలకు తుపాను ప్రభావాలను వివరించారు. తుపాను ఆంధ్రప్రదేశ్ పై ప్రభావం చూపుతుందని, తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంతో జాగ్రత్తగా ఉండాలని కోరారు. దున్నవూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామంలో మొంథా తుపాను కారణంగా ఆయన అధికారులు పర్యవేక్షణ చేశారు. గ్రామంలో శిదిలావస్థలో ఉన్న తుపాన్ బిల్డింగ్ పర్యవేక్షణ చేసిన అనంతరం డిస్మెంటల్ చేసి కొత్త తుఫాన్ షెల్టర్ కావాలని అధికారులకు తెలియజేస్తానన్నారు. ప్రజలకు తుపాన్ సూచనలు చెప్పి, ఎటువంటి ఇబ్బందిలు ఎదురైనా అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. తహసీల్దార్ మిస్క శ్రీకాంత్ పాటు రీసర్వే డీటీ శర్మ, పంచాయితీ సెక్రటరీ తిర్రి సుభాష్, వీఆర్వో హేమరాజు, సాగర్ మిత్ర గుంటు రవి, రంగారావు, ఆశ వర్కర్స్, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.పంట పొలాలలో నీరు నిలువ లేకుండా చూసుకోండి

## నాగావళి తీర ప్రాంతాలను పరిశీలించిన అధికారులు



**వీరఘట్టం, అక్టోబరు 27(వార్త):** మొంథా తుఫాన్‌పై మండల శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం నదీ తీర ప్రాంతాల్లో ఇక్కడ మండల స్థాయి అధికారులు పర్యటించారు తుఫాన్ తీవ్రత అధికంగా ఉంటుందని అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దంటూ వారు సూచించారు ముఖ్యంగా నది తీర ప్రాంతాల్లో కడకెల్ల, కిమ్మి, చిట్టపుడి వలస, గడగమ్మ, పివిఆర్ పురం, మొట్ట వెంకటాపురం, పనస నందివాడ తదితర గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించడంతో పాటు అధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు అలాగే తీవ్రమైన గాలులు కారణంగా వరి పంట నష్టపోకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వారు అన్నారు. అలాగే పాడు బడిన భవనాల వద్ద గాని, చెట్లు కింద గాని ఉండరాదని అన్నారు గ్రామాల్లో తుఫాన్ వల్ల ఎటువంటి అసౌకర్యం కలిగిన తక్షణమే వీరఘట్టంలోని కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలని వారు కోరారు.

ఈ పర్యటనలో తహాశీల్దారు ఏ.సాయి కామేశ్వరరావు, ఎంపీడీవో బి.వెంకటరమణ, ఎస్సై జి.కళాధర్, మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య తో పాటు వీఆర్వోలు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడండి



**మెళియాపుట్టి, అక్టోబరు 27(వార్త):** మొంతా తుఫాన్ నేపథ్యంలో రైతులు తమ పంట పొలాలలో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు మండేలా రామారావు అన్నారు. మండలంలో గల కోసమాల గ్రామాన్ని సోమవారం నాడు సందర్శించి స్థానిక రైతులతో మాట్లాడుతూ మోంతా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రానున్న 2 రోజులు 28, 29 తేదీలలో గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు నీరు నిలిచిపోయే పొలాలలో ముందు జాగ్రత్తగా పొలం యొక్క గట్లు తవ్వి నీరు వెళ్లే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఇలా చేయడం వల్ల వరి పంట పొలంలో ఎక్కువ నీరు నిల్వ ఉండి పంట పడిపోకుండ, నష్టపోకుండా ఉంటుందన్నారు. తుఫాన్ నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలు పై అవగాహన కల్పించారు. ఆయన వెంట మండల వ్యవసాయధికారి ఏస్. దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు క్రాంతి, రైతులు తదితరులున్నారు.

## శివనామస్మరణతో మారుమోగిన శైవ క్షేత్రాలు

**- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు**



**పలాస, అక్టోబరు 27(వార్త):** కార్తీక మాసం కావడంతో సోమవారం శివనామస్మరణతో శైవక్షేత్రాలు, దేవాలయాలు భకష్ట్రంసంద్రము, ఉత్సాహంతో మారుమోగుయి.శివనామ స్మరణ అంటే “ఓం నమః శివాయ” వంటి శివుని నామ సరగడం, స్మరణ చేయడం. ఇది శివుని మహిమ వివరించిన పురాణ కథలు ప్రకారం పాపాలు తొలగించి ముక్తికి దారితీయడం విశ్వసించబడింది. శివ నామ స్మరణతో శివ దర్శన సౌఖ్యం, భక్తుల హృదయాల్లో శాంతి, శక్తి, ఆధ్యాత్మిక పరిరక్షణ పొందుతారు. కనుక శైవక్షేత్రాలలోపలే కాదు, భక్తుల మనసులో కూడా శివనామ స్మరణ ఒక శక్తివంతమైన ఆధ్యాత్మిక ఆచారంగా కొనసాగుతుంది. శివునికి అత్యంత ప్రీతిపాతమైన బిల్వార్చన, పంచామృతం, విభూది, నారికేళి తోపాటు గంగాజలం అభిషేకాలు భక్తులు శక్తి మేరకు సమర్పించుకున్నారు. శివుని పూజిస్తే సకల సౌభాగ్యాలు కలిగి, పాపాలు నాశనం అవుతాయని భక్తులు నమ్మకం.

## నేడు మెళియాపుట్టి మండల సమావేశం



**మెళియాపుట్టి, అక్టోబరు 27(వార్త):** మెళియాపుట్టి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణా ఈశ్వరి అధ్యక్షతన మంగళవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా సోమవారం తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని, అలాగే వివిధ శాఖధికారులు ఆయా శాఖలకు సంబంధించి విధిగా పూర్తి సమాచారంతో మండల సమావేశానికి సకాలంలో హాజరు కావాలన్నారు.

## తెలుగుదేశం పార్టీ నాయకుల దాతృత్వం

**మందస, అక్టోబరు 27(వార్త):** సవరపద్మాపురంలో జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు గిరిజన కుటుంబాల ఇళ్లు పూర్తిగా దగ్ధమైన సంగతి తెలిసిందే. ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురైన పరిస్థితిని తెలుసుకున్న మందస మండల తెలుగుదేశం పార్టీ నాయకులు స్పందించారు.ఆయా కుటుంబాలను పరామర్శించి, బాధితులకు 10 వేల రూపాయల విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మందస పీఏసీఎస్ అధ్యక్షుడు తమిరియా భాస్కరరావు, పార్టీ యువనేత ముంజేటి చంద్రశేఖర్, సంతోష్ తదితరులు ఉన్నారు.



## చంద్రబాబు పాలనలో ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు, బైండోవర్లు



**పలాస, అక్టోబరు 27(వార్త):** వెన్నెలవలస ధర్మల్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సరుబుజ్జిలి తాసిల్దార్ ఆఫీస్ వద్ద మహాధర్నాను ప్రకటిస్తే నిన్న రాత్రినుండి, జల్లెడిపట్టి అరెస్టులు చేస్తు, వివిద పోలీస్ స్టేషన్లో అరెస్టులు చేసిన సిపిఐ,సిపియం,న్యూడెమొక్రసీ, గిరిజన నాయకులకను వెంటనే విడుదల చేయాలని సిపిఐ యంయల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యధర్శి తామాడ సన్యాసిరావు డిమాండ్ చేసారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ భూ బ్యాంక్ పేరుతో సేద్యం కోసం పనికొచ్చిన భూములను కార్పోరేట్లకు అప్పజెప్పడానికి మాత్రమే అదికారంలో కొచ్చిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలను ప్రజలు నిలదీయాల్సిన అవసరం ఉందని ఏఐకేయం రైతు నాయకులు మద్దిల రామారావు డిమాండ్ చేసారు. ఆంద్రప్రదేశ్ లో నిరంకుశ,నియంత్రృత్వ పాలన సాగుతుందని ప్రశ్నించారు. ఇప్పటికే అరెస్టులు చేసిన, గృహ నిర్బందంలో ఉన్న నాయకులను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని సిపిఐ యంయల్ లిబరేషన్ నాయకులు డిమాండ్ చేసారు. అరెస్టులు చేసినంత మాత్రాన పోరాటాలు ఆగిపోవని ఈ సందర్బంగా తెలియజేసారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వండి



**పలాస, అక్టోబరు 27(వార్త):** సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా సహాధ్యక్షులు నెమలిపురి విష్ణుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రివ్యూ పిటిషన్ దాఖలు చేయకుండా హడావుడిగా టెట్ నోటిఫికేషన్ జారీ అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని విద్యా హక్కు చట్టం 2009లోని సెక్షన్-23ని సవరించే విధంగా కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.ఇ ఉపాధ్యాయులకు ఇప్పుడు టెట్ నిర్వహించడమేంటని వారు ప్రశ్నించారు. టెట్ సిలబస్ చూస్తే అసమంజసంగా వుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.



## అప్రమత్తంగా ఉండండి

**మెళియాపుట్టి, అక్టోబరు 27(వార్త):** మొంథా తుఫాన్ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, నది పరివాహక ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాలు, ప్రతి ఒక్కరు అనుక్షణం అప్రమత్తతో ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఎం. రామారావు అన్నారు. సోమవారం నాడు మెలియాపుట్టి మండల పరిధిలో గల రట్టిని గ్రామాన్ని సందర్శించి అక్కడ గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామానికి ఆనుకుని ఉన్న మహేంద్ర తనయ నదీ పరివాహక ప్రాంతాన్ని సైతం పరిశీలించి రానున్న తుఫాను దృష్టిలో పెట్టుకొని గ్రామస్తులు వ్యవహరించాల్సిన జాగ్రత్తలు పై అవగాహన కల్పిస్తూనే అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అనేక అంశాలను సూచించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రామారావు తో పాటు ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండ విద్యాశాఖ అధికారులు దేవేందర్ రావు, పద్మనాభం, పోలీస్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## రైతులూ ఆందోళన చెందవద్దు : బగ్గు



**నరసన్నపేట, అక్టోబరు 27(వార్త):** మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నరసన్నపేట నియోజకవర్గం ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి కోరారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28,29 తేదిల్లో ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వర్షాలతో పాటు, సముద్రం కూడా అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని కోరారు. అదేవిధంగా రైతులు ఎవ్వరు కూడా ఆందోళన చెందవద్దని తెలిపారు. అధికారులు అందరు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. విద్యుత్, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో పరిస్థితులపై అధికారులతో ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. సహాయక చర్యల కోసం బృందాలు కూడా సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శ్రీకాకుళం కంట్రోల్ రూమ్ 08942-240557 ను సంప్రదించాలని కోరారు.

## నరసన్నపేటలో ఈదురుగాలులు.. విరిగిపడ్డ చెట్లు



**నరసన్నపేట, అక్టోబరు 27(వార్త):** నరసన్నపేట పరిసర ప్రాంతాల్లో తుపాను ప్రభావం కనిపిస్తుంది. రాత్రి నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు అంటున్నారు. వర్షాలకు తోడు గాలులు వీయడంతో చెట్లు విరిగి పడుతున్నాయి. స్థానిక గర్ల్స్ హైస్కూల్ వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. స్టేట్ బ్యాంకు వెళ్లే మార్గం కావడం, ప్రధాన వీధులకు వెళ్లే మార్గం కావడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

## మనసున్న మహిళా మణులు

**సోంపేట, అక్టోబరు 27(వార్త):** పొందూరు పుట్టుగ గ్రామానికి చెందిన దూగాన రామ్మూర్తి, ఆయన కుమారుడు ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రిలో లక్షలాది రూపాయలు చికిత్స కోసం వెచ్చించాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో అనేక గ్రామాల నుంచి, స్వచ్ఛంద సంస్థల నుంచి ఆర్థిక సహాయాలు అందిస్తుండగా గొండ్యాల పుట్టుక నుంచి కూలి పనులు చేసుకునే నలుగురు మహిళలు పేదరికం అడ్డుపడినా సరే తమలాంటి పేదవాని కోసం ఆపన్న హస్తం అందించారు. నీ లవేణి, లింగమ్మ, సుహాసిని, హేమావతి కలసి వెయ్యి రూపాయలు ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. వీరి సహాయాన్ని ఎంతోమంది అభినందిస్తున్నారు. ఇదిలా ఉండగా బొర్ర పుట్టుక యువత 26 వేల రూపాయల సహాయం సోమవారం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.



# మీరే మా మాస్టార్

## * ప్రభాకర్ మాస్టార్‌కు ఘన సన్మానం



**మందస, అక్టోబరు 27(వార్త):**మాస్టార్.. మీరే మా'స్టార్' అంటూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ప్రభాకర్ పట్నాయిక్ మాస్టారు ఆయన సతీమణి శోభారాణి దంపతులకు విద్యార్థులు ఘన సన్మానం చేశారు. మందస పట్టణంలో ప్రభాకర్ పట్నాయిక్ ఆయన శిష్యులు ఘనంగా సన్మానించి, పొగడ్తలతో ముంచెత్తారు. ఆయన శిష్యులైన నోంద్రాన షణ్ముఖరావు, బనిశెట్టి హేమసుందర్, కొల్లి పురుషోత్తం, బూరగాపు బాలరాజు తదితరులు మాట్లాడుతూ సమాజాన్ని విద్య అనే ఆయుధంతో ప్రభాకరునిలా మేల్కొలిపారన్నారు. ప్రభాకరునిగా ఆయన చూపిన దారిలో విద్యార్థులు ఎంతో మందికి ఉన్నత భవిష్యత్ లభించిందన్నారు. మార్గ నిర్దేశకునిగా, సమాజానికి ప్రభాకరునిగా ఎంతో మంది సమాజానికి దిక్సూచిగా నిలిచారన్నారు. గురువుగా గురుతర బాధ్యతను భుజాలపై వేసుకుని, శిష్యులను ప్రభాకర్ మాస్టారు ఉన్నతులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు లింగరాజు గీచిన చిత్రం ప్రభాకర్ పట్నాయిక్ బహుమతిగా అందజేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రభాకర్ పట్నాయిక్, శోభారాణి దంపతులను దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ పట్నాయిక్ శిష్యులు భారతి, మద్ది ఉమామహేశ్వరరావు, వడ్డి వెంకటరమణ, రేగి భైరాగి, రేగి ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుపరం చేయొద్దు

**వీరఘట్టం, అక్టోబరు 27(వార్త):** ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయొద్దంటూ సోమవారం మండలంలోని కత్తులకవిటి గ్రామంలో జడ్పిటిసి జంపు కన్నతల్లి ఆధ్వర్యంలో కోటి సంతకాలు కార్యక్రమాన్ని నిర్వహించారు గత వైకాపా ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీ కరించాలన్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని అన్నారు . ప్రజా వైద్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వటం ఏమిటని ఆమె ప్రశ్నించారు. పేద, సామాజిక,మధ్యతరగతుల వారికి ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలో అందివ్వాలనే దృక్పథంతో వాటిని ఏర్పాటు చేస్తే, నేడు ప్రైవేట్ వ్యక్తులకు ధారాధాత్తం చేయడం ఎంతవరకు సమంజసం అని ఆమె ప్రశ్నించారు . ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే విరమింపు చేసుకోవాలని ప్రజలకు అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని ఆమె కూటమి ప్రభుత్వానికి సూచించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గేదెల సుదర్శనరావు ఎంపీటీసీ కొత్తవలస పరిమళ, గ్రామ పెద్దలు వైకాపా నేతలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు



# అన్ని శాఖల సిబ్బంది సిద్ధంగా ఉండాలి



**సోంపేట, అక్టోబరు 27(వార్త):** తుఫాన్ నేపథ్యంలో అన్ని శాఖల అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసే ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం లేకుండా కంచిలి మండలంలో సమర్థవంతమైన సేవలందించేందుకు సిద్ధం కావాలని కంచిలి తాహసిల్దార్ రమేష్ కుమార్, ఎంపీడీవో తిరుమలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో 31 పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. తుఫాను హెచ్చరికలు, విపరీతమైన ఈదురుగాలుల వేగంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని పంచాయతీల్లోనూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తిన వెంటనే అధికారులకు సమాచారం అందించి వాటి పరిష్కారానికి సత్వరం కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని నొక్కి చెప్పారు.

# ప్రజలు ఇబ్బందుల పాలవ్వకుండా చూడండి

**పలాస, అక్టోబరు 27(వార్త):** మొంథా తుఫాను నేపథ్యంలో ఏర్పడబోయే అధిక తీవ్రత గల ఈదురు గాలు, అధిక వర్షము వలన జరిగే నష్టాన్ని ఎదుర్కొనేందుకుగాను మున్సిపల్ పరిధిలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు మరియు సచివాలయం సిబ్బందితో మునిసిపల్ కమిషనర్ సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ తుఫాను దృష్ట్యా పుర ప్రజలకు ఎటువంటి నష్టం అసౌకర్యాలను ముందుగా గుర్తించి వాటి వలన ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడవలసిందిగా సిబ్బందిని కోరారు. పురపాలక సంఘం పరిధిలో గల గర్భిణీ స్త్రీలను గుర్తించి వారిని ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించవలసిందిగా హెల్త్ కార్యదర్శులకు సూచించారు. ప్రజలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్న త్రాగునీరు కలుషితం కాకుండా చూడమని, ఎప్పటికప్పుడు పైప్ లైన్ ల లీకేజీలను గుర్తించి వాటిని అరికట్టవలసిందిగా ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. ప్రధాన కాలువల జంక్షన్ల వద్ద మురుగునీరు సక్రమంగా ప్రవహించే విధంగా చూడాలని, కాలువలలోని సిల్ట్, చెత్తను ఎప్పటికప్పుడు తీసివేయించవలసిందిగా శానిటేషన్ సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుటకు గాను అద్దె ప్రాతిపదికపై 2 జెసిబిలను, 2 జనరేటర్ లను, ట్రీ కట్టర్ లను అందుబాటులో ఉంచమని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. పాడు బడిన భవనంలలో నివాసముంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించవలసిందిగా టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఈ తుఫాను దృష్ట్యా సచివాలయ సిబ్బంది సెలవులను రద్దపరుస్తూ, సిబ్బంది అందరూ సచివాలయంలలో ప్రజలకు అందుబాటులో ఉండవలసిందిగా కమిషనర్ ఆదేశించారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


## ట్రైన్ నుంచి జారిపడి మహిళకు గాయాలు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 27(వార్త):** ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లో ప్రమాదం జరిగింది. రైలు దిగుతూ మహిళా కిందపడి తలకు గాయమైంది. బొడ్డకాలి గ్రామానికి చెందిన దారపు లోలాక్షి పారదీప్‌లో భర్తతో వుంటుంది. బంధువుల ఫంక్షన్ ఉండటంతో విశాఖ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. తుపాన్ కారణంగా ఇచ్ఛాపురంలో వర్షం పడుతుండడంతో రైలు ఆగి దిగుతుండగా రైలు కదలటంతో లగేజీతో కాలుజారి కిందపడింది. తలపై బలమైన గాయం తగిలింది. సమాచారం అందుకున్న ఇచ్ఛాపురం 108సిబ్బంది లోలాక్షిని ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



# వీరుడి త్యాగం..సమాజానికే ప్రేరణ!

**కోటబొమ్మాళి, అక్టోబరు 27(వార్త):** దేశం కోసం ప్రాణాలర్పించిన ధైర్యవీరుడు రొక్కం శ్రీనివాస రావు సేవలు సమాజానికే ఆదర్శమని కాకినాడ మూడవ బెటాలియన్ అసిస్టెంట్ కమాం డెంట్ ఎస్.మన్మధరావు అన్నారు. కోటబొమ్మాళి మండ లం నీలంపేట గ్రామంలో జరి గిన పోలీసుల అమరవీరుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, అమరుడైన శ్రీనివాస రావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పిం చారు. 1992 ఏపీఎస్పీ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాస రావు, గ్రేహౌండ్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ, 1998 ఆగస్టు 8న పార్వతీపురం సమీపంలోని కొమరాడ మండలం కొప్పాడంగి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీర మరణం పొందారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ, "దేశం కోసం ప్రాణాలు అర్పించిన శ్రీనివాసరావు మీ గ్రామస్తుడు కావడం గర్వకారణం అన్నారు. ఆయన త్యాగం ప్రతి యువతకు ప్రేరణ కావాలి"అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు సతీమణి అలివేణి, తల్లి మాణిక్యం, సర్పంచ్ సావిత్రమ్మ, గ్రామ పెద్దలు రొక్కం కళ్యాణ్ సాగర్, ఎస్. వైకుంఠరావు, ఆనంద రావు, బాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.





## తుఫాన్‌పై ప్రత్యేక సమావేశం

జలుమూరు, **అక్టోబరు 27(వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మండల స్థాయి అధికారుల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి అరుంధతి దేవి అన్నారు. జలుమూరు తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికార ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడవలసిన బాధ్యత ఉందని అన్నారు. ఆమెతోపాటు తహసిల్దార్ రామారావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మందస ఎంపీపీ దానయ్య



**పలాస, అక్టోబరు 27(వార్త):** వైఎస్సార్సీపీ బీసీ విభాగం రాష్ట్రసంయుక్త కార్యదర్శిగా మందస ఎంపీపీ దానయ్య, వైయస్సార్సీపి రాష్ట్ర గ్రీవెన్స్ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన, సార ఢిల్లీ రావులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన కార్యాలయంలో సోమవారం సత్కారం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్సీపి వ్యవస్థాపకులు, జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ పదవుల్లో కొనసాగుతారని వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ పార్టీ కోసంపనిచేసే వారికి పదవులు దక్కుతాయని, కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని చెప్పారు. ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పని చేసినప్పుడే గుర్తింపు వస్తుందని చెప్పారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ పార్టీ పెట్టుకు నమ్మకాన్ని మేము వమ్ము చేయమని, ప్రజల్లో ఉంటూ వారి అవసరాలను గుర్తించి పని చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు.. జాగ్రత్తలు పాటించండి: సీఐ



**నరసన్నపేట, అక్టోబరు 27(వార్త):** కార్తీక మాసం సందర్భంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా తెల్లవారుజామున దేవాల యాలకు వెళ్ళేటప్పుడు విలువైన బంగారు ఆభర ణాలు ధరించవద్దని నరసన్నపేట సర్కిల్ కార్యాల యంలో సీఐ ఎం శ్రీనివాసరావు సూచించారు. చీకటి సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున కుటుంబ సభ్యులతో కలిసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# నిశ్శబ్ద సేవకు దశాబ్దం..రోటరీనగర్ 20 కుటుంబాల ఆదర్శం!

**పలాస, అక్టోబరు 27(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రోటరీ నగర్ ప్రాంతంలో నివసిస్తున్న సుమారు 20 కుటుంబాలు గురునాథ్ మాస్టర్ ఆధ్వర్యంలో గత 10 సంవత్సరాలుగా మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తున్నారు. వీరిలో కొంతమంది ప్రతి నెల వీరు కొంత మొత్తం స్వచ్ఛందంగా పోగుచేసి, ఆధారం లేని, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న, ఇల్లు నడపడం కష్టంగా ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో కూడా, వీరు తమ సేవా కార్యక్రమాలను ఆపకుండా, అనేక కుటుంబాలకు ఆహార సరఫరా చేస్తూ అండగా నిలిచారు. ఇది వారి నిజమైన సేవా స్ఫూర్తికి నిదర్శమని స్థానిక అంటున్నారు. ప్రతి నెల సుమారు 50-60 మందికి సాయం అందిస్తూ, ఎటువంటి ప్రచారం లేకుండా మానవత్వానికే అంకితం అయిన ఈ సేవ నిజంగా స్ఫూర్తిదాయకమని కొనియాడుతున్నారు. వీరి సేవలను గుర్తించి సాయి రామ్ ట్రస్ట్ వారు ఆదివారం



కుటుంబ సమేతంగా అందరికి ఆహ్వానించి సన్మానం చేశారు. ఇది వారి దశాబ్దాల సేవకు లభించిన గౌరవ చిహ్నంగా అభివర్ణించారు. రోటరీ నగర్ గురునాథ్ మాస్టర్ బృందం చేస్తున్న ఈ సేవ మనందరికీ స్ఫూర్తిదాయకం, గర్వకారణంఅని పలువురు చెప్తున్నారు. మీ పరిసరాల్లో ఎవరికైనా సహాయం అవసరముంటే ఈ సేవకులు ఎప్పుడూ ముందుండి చేయూతనివ్వడానికి సిద్ధంగా ఉంటారని, దయచేసి వారిని సంప్రదించవచ్చుని ఆ కుటుంబాలు తెలిపాయి.

## వైసీపీ మేధావి విభాగ రాష్ట్ర కార్యదర్శిగా మొదలవలస మన్మథరావు



**పలాస, అక్టోబరు 27(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా పలాస అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మొదలవలస మన్మధరావు కు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సూచన మేరకు రాష్ట్ర మేధావి అనుబంధ విభాగ కార్యదర్శిగా నియమించారు. పలాస నియోజకవర్గంలో మొదలవలస మన్మధరావు గడిచిన కాలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి, కష్ట సమయంలో నాయకులను కార్యకర్తలను ఒకే తాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో కీలక స్థానం కల్పించినందుకు ముందుగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి కు మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపిన పలాస మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాళింగ కులానికి సరైన గుర్తింపు ఇచ్చారని ఇటువంటి మేధావి రాష్ట్ర స్థాయిలో తమ సేవలను మరింత వినియోగించి పార్టీ బలోపేతానికి కృషిచేసి పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరుతున్నట్లు పలాస మున్సిపాలిటీ కో -ఆప్షన్ సభ్యుడు సంతోష్ తెలిపారు.

## మూర్ఛ వ్యాధితో గాయపడి ఒకరి మృతి

**నరసన్నపేట, అక్టోబరు 27(వార్త):** నరసన్నపేట మండలం కోమార్తికి చెందిన బీశెట్టి లక్ష్మణరావు (40) ఆదివారం సాయంత్రం జాతీయ రహదారిపై మూర్ఛతో పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో తల్లి త్రినాధమ్మ అతన్ని శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్ కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ట్రైనింగ్ ఎస్సై ప్రమీల దేవి తెలిపారు.



# సమస్యల పరిష్కారమే లక్ష్యం



**సోంపేట, అక్టోబరు 27(వార్త):** కంచిలి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వపరంగా కృషి చేయడమే మన లక్ష్యం కావాలని కంచిలి మండలం టిడిపి అధ్యక్షుడు మాదిరి రామారావు పేర్కొన్నారు. కంచిలో సోమవారం టిడిపి జనసేన పార్టీల 31 పంచాయతీల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామారావు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చి స్వల్ప కాలంలోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి విషయంలో అనేక పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. ఇంకా అనేక గ్రామాలకు సంబంధించి ప్రభుత్వానికి అందించిన ప్రతిపాదనల పట్ల ప్రజా ప్రతినిధులు అలాగే ఉన్నతాధికారులతో సంప్రదించి త్వరగా ఆయా అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేద్దామని అన్నారు. తుఫాను హెచ్చరికలు భారీ వర్షాలు విపరీతమైన ఈదురుగాలుల నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడ ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ నాయకులు కార్యకర్తలు ముందుండి వాటి పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని రామారావు పిలుపునిచ్చారు. సమావేశంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546